# అఫ్ఘానిస్తాన్ భవితవ్యం

– కె. బాలగోపాల్★

అఫ్ఘానిస్తాన్‌పైన అమెరికా చేస్తున్న యుద్ధం లక్ష్యాలు మనం చూస్తుండగానే మారుతున్నాయి.

టెర్రరిజంను శాశ్వతంగా మట్టుబెట్టే యుద్ధంగా అది మొదలయింది. నిజమే, టెర్రరిజం అని పిలవబడే దాని సామాజిక రాజకీయ పార్శ్వాలను వారు చూడదలచుకోలేదు. అందువల్ల తాము వేటాడుతున్నదాని నైజాన్ని అర్థం చేసుకో నిరాకరించారు. అంతేకాక టెర్రరిజం అంటే వట్టి బీభత్సమేననుకున్నా ఆ పదాన్ని అమెరికా ప్రయోగించే తీరులో చాలా సమస్యలు లేకపోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆ అగ్రరాజ్యం తన ప్రయోజనాలకు ఉపయోగపడే బీభత్సానికి ఆ పేరు ఎప్పుడూ పెట్టలేదు. ఆ ప్రయోజనాలకు వ్యతిరేకమైన రాజకీయ కార్యకలాపాలను మాత్రం – అనేక జాతి విముక్తి ఉద్యమాలనూ సామాజిక ఉద్యమాలనూ కూడా – బీభత్సకాండ అని నిందించారు. కాగా అమెరికా, దాని మిత్రదేశాలు ప్రత్యక్షంగా చేసిన బీభత్సాన్ని సైతం టెర్రరిజం అనకపోగా ప్రజాస్వామ్యమూ మానవహక్కులూ మొదలయిన గొప్ప విషయాలను రక్షించే కార్యక్రమాలుగా వాటిని అభివర్ణించారు.

ఇదంతా నిజమే అయినప్పటికీ, మొదట్లో ప్రకటించుకున్న లక్ష్యం కనీసం చెప్పుకోవడానికి గంభీరంగా ఉండింది. ఇప్పుడది మారి అగ్రరాజ్యాలకు సుపరిచితమైన లక్ష్యం రూపం తీసుకునింది. అఫ్ఘానిస్తాన్‌ను అదుపు చేయడం ఇప్పుడా యుద్ధం లక్ష్యం. అమెరికా, దాని మిత్రదేశాలు అఫ్ఘానిస్తాన్‌ను విడిచిపోయేలోపల తమ ప్రయోజనాలకు తగిన రాజ్యాన్ని ఆ దౌర్భాగ్యపు దేశంలో కూచోబెడతారు. 'టెర్రరిజం అంతానికి కంకణం కట్టిన అంతర్జాతీయ కూటమి'లో ఒక్కొక్కరికీ అఫ్ఘానిస్తాన్ భవిష్యత్తు గురించి ఒక అభిప్రాయం ఉంది, ఒక నమూనా ఉంది.

అమెరికాకు కావాల్సింది తన శత్రువులకు ఆశ్రయం ఇవ్వని రాజ్యం. దానితోబాటు మధ్య ఆసియాలోని నూనె, సహజవాయు నిక్షేపాలు కరాచీ రేవుకు తీసుకుపోవడానికి సహకరించే ప్రభుత్వం, పాకిస్తాన్‌కు తన మిత్రుడిగా ఉండే రాజ్యం కావాలి. ఇండియాకు పాకిస్తాన్ మిత్రునిగా ఉండని రాజ్యం కావాలి. ఉజ్బెకిస్తాన్‌కూ తజకిస్తాన్‌కూ ఇస్లామిక్ మతవాదాన్ని ఎగుమతి చేయని

★ *మానవ హక్కుల కార్యకర్త. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో 25.10.2001 నాడు రాసిన వ్యాసానికి అనువాదం.*

రాజ్యం కావాలి. రష్యాకూ అదే కావాలి, కానీ ఇంకా నిర్దిష్టంగా చెచెన్యాకు మిలిటెంట్లను పంపించని రాజ్యం కావాలి.

ఇది 'అంతర్జాతీయ కూటమే'. కానీ టెర్రరిజాన్ని అంతం చేసే కూటమి కాదు. వారివారి ప్రయోజనాల కనీస సామాన్య లక్షణాలకు అనుగుణంగా అఫ్ఘానిస్తాన్ రూపురేఖలను తిరగరాయడానికి పూనుకున్న కూటమి. చరిత్ర నిండా ఇటువంటి బహుళ రాజ్య కూటములు కనిపిస్తాయి. ఎటొచ్చీ గతంలో అవి అనంతమైన న్యాయం అనీ అఖండమైన స్వేచ్ఛ అనీ పేర్లు తగిలించుకోలేదు.

టెర్రరిజాన్ని అంతం చేయడం ప్రకటిత లక్ష్యమైన దశలో ప్రజాస్వామ్యం అందుకు ప్రేరణ అన్నారు. ఇప్పుడు నడుస్తున్న ప్రయత్నాలకు ప్రేరణ ఏదయినా కావచ్చును గానీ ప్రజాస్వామ్యం మాత్రం కాదు. ఆధునిక కాలంలో తమ దేశీయ వ్యవహారాలపైన ఏరకమైన అజమాయిషీ ఏరోజూ ఉండని అఫ్ఘాన్ ప్రజల పీడకలను ఇంకొంతకాలం కొనసాగించడం రేపు జరగబోయేది. ఆ దేశానికి ఉన్న నైసర్గిక - రాజకీయ పరిస్థితి కారణంగా ఒక శతాబ్దం పైగా అది అప్పటి అగ్రరాజ్యాల నిరంతర జోక్యం కింద నలిగిపోయింది. గడచిన రెండు నెలలుగా ప్రజాస్వామ్యాన్ని గురించి, నాగరికత గురించి మనం వింటున్న పెద్దపెద్ద మాటలన్నీ, ఆ దుర్భరమైన ఇతిహాసంలో మరొక అధ్యాయం రాయబోతున్నారన్న వాస్తవానికి అందమైన ఆచ్ఛాదన మాత్రమే. ఈ కొత్త అధ్యాయంలో కనీసం ఒక పాద సూచిక లభించే అవకాశం తనకివ్వాలన్నది భారత్ తాపత్రయం.

19వ శతాబ్దంలో అఫ్ఘానిస్తాన్‌కు ఉత్తరాన జార్ చక్రవర్తుల రష్యా సామ్రాజ్యం ఉండింది, దక్షిణ ఆగ్నేయ సరిహద్దుల ఆవల బ్రిటిష్ సామ్రాజ్యం ఉండింది. ఆ రెండు పెత్తందారీ రాజ్యాలూ విరామం లేకుండా అఫ్ఘాన్ వ్యవహారాలలో జోక్యం చేసుకున్నాయి. ఆ తరువాత బోల్షెవిక్ విప్లవం వచ్చింది. దానిని అణచడానికి అమెరికా తయారుచేసిన కూటమి పుట్టింది. సోవియట్ రష్యా త్వరలోనే అగ్ర రాజ్యాల చిల్లర లక్షణాలన్నీ అలవరచుకుంది. త్వరలోనే అఫ్ఘానిస్తాన్ అమెరికా - రష్యాల 'ప్రచ్ఛన్న యుద్ధం'లో భాగమయింది. రష్యా బలవంతంగా కూచోబెట్టిన ప్రభుత్వాన్ని అఫ్ఘానిస్తాన్ భరించవలసి వచ్చింది. ఆ తరువాత ఆ ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా ఎగదోసిన అంతర్యుద్ధాన్నీ భరించవలసి వచ్చింది. వెనుకబడిన దేశాన్ని ఆక్రమించుకున్న ఒక ఆధునిక సైన్యం మీద పోరాటం చేయడానికి మత మౌఢ్యమే సరయిన ఆయుధం అని అమెరికా సంకుచితంగా లెక్కలు వేసింది. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న 'జిహాదీలు' అందరినీ ఒకచోట చేర్చి రష్యా నెలకొల్పిన ప్రభుత్వం పైకి ఎగదోసింది. రష్యా వాళ్లు వెళ్లిపోయారు గానీ మత తీవ్రవాదులు ఉండిపోయి అఫ్ఘాన్ పాలకులయ్యారు. అఫ్ఘానిస్తాన్‌ను సాయుధ మత మౌఢ్య కేంద్రం చేశారు. పోను పోను ఒకనాటి అమెరికా మిత్రులు అమెరికాకే శత్రువులయ్యారు. ఆ కారణంగా మానవ నాగరికతకూ శత్రువులయ్యారు. ఇప్పుడు వాళ్లను గద్దె దించే కేళి మొదలయింది.

ప్రపంచంలోని అన్ని దేశాలూ చిన్నవీపెద్దవీ - ఇండియాతో సహా - ఈ కేళిలో భాగమయ్యాయి. వారివారి విభిన్నమయిన (ఇక్కడే సమస్య ఉంది) అవసరాలకు అనుగుణమైన ప్రభుత్వాన్ని అఫ్ఘానిస్తాన్‌లో నెలకొల్పే విషయమై బేరసారాలు చేస్తున్నారు, లెక్కలు వేస్తున్నారు. ఎంతమంది పఖ్తూన్లు, ఎంతమంది పఖ్తూనేతరులు ఆ ప్రభుత్వంలో ఉండాలి, ఏ పఖ్తూన్లు మంచి పఖ్తూన్లు

అనే చర్చలో అంతా తల మునిగి ఉన్నారు. ఈ వైఖరి ఎంత హేయమైనదో అర్థం చేసుకోవాలంటే దీనికి ఒకే ఒక మినహాయింపుగా ఉన్న ఇరాన్‌ను ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇరాన్ 'ప్రయోజనాలు' కూడా ఇండియా పాకిస్తాన్‌ల 'ప్రయోజనాల'తో సమానంగా అఫ్ఘానిస్తాన్‌తో ముడిపడి వున్నాయి. అయినప్పటికీ ఇరాన్ అధ్యక్షుడు మహమ్మద్ ఖటామీ 'అమెరికా, తాలిబాన్‌లు ఒకే నాణానికి బొమ్మా బొరుసుల'ని ప్రకటించే నైతిక ధైర్యాన్ని ప్రదర్శించాడు, తన దేశాన్ని ఈ కేళికి దూరంగా ఉంచాడు.

అందరి కోరికలూ తీరతాయేమో గానీ అఫ్ఘాన్ ప్రజలకు దీనినుండి ఏమొస్తుంది? తమ కోరికలకు తగిన రాజ్యంగానీ, ప్రభుత్వం గానీ రాదని ఖచ్చితంగా చెప్పొచ్చు. రాబోయే అఫ్ఘాన్ ప్రభుత్వం అమెరికా ప్రయోజనాలకు 70 శాతం అనుకూలంగా ఉండవచ్చు. పాకిస్తాన్ ప్రయోజనాలకు 10 శాతం, మధ్య ఆసియా ప్రభుత్వాల ప్రయోజనాలకు 10 శాతం, రష్యా ప్రయోజనాలకు 5 శాతం, దేబిరిస్తున్న ఇండియా ప్రయోజనాలకు కూడా ఒక్క శాతం అనుకూలంగా ఉండవచ్చును గానీ అఫ్ఘానిస్తాన్ ప్రజల అవసరాలనూ ఇష్టాయిష్టాలనూ వ్యక్తం చేసే ప్రభుత్వం మాత్రం కాబోదు.

ఆపైన 'అంతర్జాతీయ కూటమి' సంతృప్తిచెంది అఫ్ఘానిస్తాన్‌ను వదిలి వెళ్ళిపోతుంది. కానీ అది అఫ్ఘానిస్తాన్‌లో అంతర్యుద్ధం బీజాలు వదిలి వెళ్తుంది. ఆ కూటమి ప్రయోజనాల నిమిత్తం చేసిన ఏర్పాటువల్ల అసంతృప్తులయిన వారు ఉంటారు. వారు ఊరుకోరు. అధికారం కోసం మరొక రౌండు యుద్ధం మొదలవుతుంది. ఆ అంతర్యుద్ధాన్ని, దాని పర్యవసానమయిన సామాజిక, ఆర్థిక పారిశ్రామిక విధ్వంసాన్నీ, రాజకీయ స్వాతంత్ర్యమంటే ఏమిటో ఎరుగని ఆ ప్రజలు భరించాలి.

అసహ్యాకరమైన ఈ కేళిలో ఇండియా కూడా భాగం కావాలని మనం కోరుకుంటున్నామా?

❋